క్లుప్తంగా

16 అడుగుల రోడ్డు వేయాలని విజ్ఞప్తి

టెక్కలి: రావివలస పంచాయతీ దామోదరపురం గ్రామంలో ముందస్తుగా పేర్కొన్న ప్రకారం 16 అడుగుల రోడ్డును వేయాలని గ్రామానికి చెందిన బి.శివ, ఎం.ధర్మారావు, ఎస్.చలపతిరావు, ఎస్.దుర్గాకుమార్, బి.శ్యామలరావు, ఎ.శోభన్‌బాబు, బిఎస్.నారాయణ, జి.వెంకటరమణతో పాటు మరికొంతమంది కోరారు. ఈ మేరకు ఎంపీడీవో లక్ష్మీబాయికి బుధవారం విన్నవించారు. గతంలో 16 అడుగుల రోడ్డు వేస్తామని అధికారులు హామీ ఇచ్చి.. ఇప్పుడు 12 అడుగులు వేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామస్తులకు ఉపయోగకరంగా 16 అడుగుల రోడ్డును మాత్రమే వేయాలని డిమాండ్ చేశారు.

21న మండల సమావేశం

కంచిలి: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వి.తిరుమలరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



పరామర్శలో చైర్‌పర్సన్ విజయ తదితరులు

కంచిలి: చిన్నకొజ్జిరియా గ్రామానికి చెందిన పిరియా సాయ్య ఇటీవల మృతి చెందారు. దీంతో మృతుని కుటుంబాన్ని జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ బుధవారం పరామర్శించారు. సాయ్య కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమెతో పాటు స్థానిక సర్పంచ్ గొనప సీతారాం, బొడ్డ శివాజీ, గొనప నారాయణమూర్తి, చెత్త సహదేవ్ ఉన్నారు.

కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



కోట త్రినాథరెడ్డి, అధ్యక్షుడు

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు, ఈవోపీఆర్డీ డి.తిరుమలరావు ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ బుధవారం జరిగింది. అధ్యక్షునిగా కోట త్రినాథరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ధర్మవరపు గౌతమి, కోశాధికారిగా కుమ్మరి కామరాజు, ఉపాధ్యక్షులుగా నొక్కు ఈశ్వరరావు, యాదం భాగ్యలక్ష్మి, గౌరవ అధ్యక్షునిగా కొర్రాయి యాదవరాజు, ముఖ్య సలహాదారుగా సవర వెంకటస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బెవర మోహనరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రోణంకి మధు, ఆఫీస్ బేరర్‌గా హనుమంతు శరత్‌చంద్ర దొరలను ఎన్నుకున్నారు. కార్యవర్గ జాబితాను ఎంపీడీవో రమేష్ నాయుడుకి అందించారు.

సారా రవాణా చేస్తే చర్యలు

సోంపేట: సారా తయారీ, రవాణాదారులపై కఠిన చర్యలు తప్పవని సోంపేట ఎక్సైజ్ సీఐ కె.బేబీ అన్నారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మందస మండలం చాపరాయిలో సిబ్బందితో కలిసి బుధవారం దాడులు చేశామన్నారు. ఈ సందర్భంగా 600 లీటర్ల బెల్లం ఊట, 50 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్టు సీఐ చెప్పారు. దాడుల్లో సోంపేట, నరసన్నపేట, ఇచ్ఛాపురం స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

టెక్కలి: టెక్కలి మండలం తిర్లంగి పంచాయతీ మాజీ సర్పంచ్ వజ్జ నరసన్న (92) బుధవారం మృతి చెందారు. ఈయన ఐదు పర్యాయాలు సర్పంచ్‌గా, రెండు ఎంపీటీసీ సభ్యుడుగా సేవలు అందజేశారు. ఈయన మృతికి పలువురు ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

22న పాణిగ్రాహి వర్ధంతి సభ

పలాస: శ్రీకాకుళం పట్టణానికి సమీపంలోని పెద్దపాడు వానవానిపేట కాలనీలో ఈ నెల 22వ తేదీన జరగనున్న విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి 55 వర్ధంతి సభను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు బొడ్డపాడు, మాకన్నపల్లి, మామిడిపల్లి గ్రామాల్లో బుధవారం ప్రచారం చేసి కరపత్రాలను పంపిణీ చేశారు. సంఘాల నాయకులు పోతనపల్లి కుసుమ, జడ్డే అప్పయ్య, సార జగన్, కర్రి అప్పారావు ఉన్నారు.

ఆవేదన తీరేదెప్పుడు!





మడుగును తలపిస్తున్న రోడ్డు (ఇన్‌సెట్లో) అతికష్టంగా ప్రయాణం చేస్తున్న వాహనదారులు

- నరకాన్ని చూపిస్తున్న బెండి ఆర్‌అండ్‌బీ రోడ్డు
- అడుగుకో మడుగుతో ప్రజల అవస్థలు

వజ్రపుకొత్తూరు రూరల్:

రోడ్లపై గుంతల్లేకుండా చేస్తామని హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం చేతల్లో మాత్రం చేసి చూపించడం లేదనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. దీనికి వజ్రపుకొత్తూరు మండలంలోని పలు రోడ్లను ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ మండలంలో ప్రధాన రోడ్లలో ఒకటైన బెండి గేటు–వజ్రపుకొత్తూరు ఆర్‌అండ్‌బీ రహదారి అడుగుకో గోతుతో నరకాన్ని చూపిస్తోంది. మండల కేంద్రానికి చేరుకోవడానికి, అలాగే మంచినీళ్లపేట, నువ్వలరేవు, వజ్రపుకొత్తూరు, హుకుంపేట తదితర మత్స్యకార గ్రామాలకు వెళ్లాలంటే ఈ రోడ్డే ప్రధానం. ఈ రోడ్డుపై నుంచే బెండి, సీతాపురం, కొండవూరు, నగరంపల్లి, పల్లివూరు, పూడిలంక, గల్లి, శివరాంపురం, పెద్దబొడ్డపాడుతో పాటు మరో 20 గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణం చేస్తుంటారు. అలాగే వందలాది వాహనాలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డు బెండి నుంచి పూడి గల్లి మధ్యలో సుమారు నాలుగు కిలోమీటర్లు అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షానికి గుంతలో నీరు చేరి అడుగుకో మడుగును తలపిస్తుంది. రోడ్డు గుంతలమయం కావడంతో ప్రయాణం సవాల్‌గా మారుతోంది. శిథిలమైన రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చెరువును తలపిస్తున్న రోడ్డు

వైఎస్సార్‌సీపీ సర్కార్ హయాంలో..

పూర్వ కాలంలో రాజులు వారి వ్యాపారరీత్యా నువ్వలరేవు నుంచి ఒడిశాలోని పర్లాకిమిడి వరకు ఈ రోడ్డుని నిర్మించారు. అయితే ఇన్నేళ్లు గడిసినా అభివృద్ధికి నోచుకొని రోడ్డును నువ్వలరేవు నుంచి టెక్కలిపట్నం రేగులపాడు వరకు సుమారు రూ. 22 కోట్లు వ్యయంతో డబుల్ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రోడ్డు నిర్మాణంలో భాగంలో ఎర్త్ వర్క్ పనులు, కల్వర్టులు, రక్షణ గోడలు, పలు గ్రామాల వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులతో పాటు కొంత మేర తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రోడ్డు అభివృద్ధి పనులు సుమారు 50 శాతం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. నిర్మాణ పనులు జరుగుతుండగా ఎన్నికలు రావడం.. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో ఈ రోడ్డును అభివృద్ధి చేసే నాథుడే కరువయ్యారని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కనీసం మరమ్మతులైన చేపట్టి రహదారి కష్టాలు తీర్చాలని ప్రజలు వేడుకుంటున్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు పలాస విద్యార్థులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, శిక్షకులు మధు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను బుధవారం అభినందించారు. చెన్నైలోని సెంట్రల్ యూనివర్సిటీలో ఇటీవల జరిగిన పోటీల్లో ప్రతిభకనబర్చడం ద్వారా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. త్వరలో పాండిచేరిలోజరగనున్న పోటీలో కళాశాలకు చెందిన ఓ బాలిక, ఐదుగురు బాలురు పాల్గొంటారన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ పి.మధును ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతన సిబ్బంది అభినందించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

టెక్కలి రూరల్: చెడు వ్యసనాలకు అందరూ దూరంగా ఉండాలని టెక్కలి సీఐ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని చిన్నకేదారి గ్రామంలో బుధవారం రాత్రి సంకల్పం కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల వినియోగంతో తలెత్తనున్న అనార్థలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంచాలని అన్నారు. అదేవిదంగా టెక్కలి ఎస్ఐ రాము నేతృత్వంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో స్థానిక బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు హైస్కూల్ సిబ్బంది రోణంకి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమిత్ షా క్షమాపణలు చెప్పాలి



సల్ల దేవరాజు

ఇచ్ఛాపురం రూరల్: అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం శాఖామంత్రి అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ సేవా సంఘం అధ్యక్షుడు సల్ల దేవరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో హోంశాఖామంత్రి అమిత్ షా ప్రసంగిస్తూ అంబేడ్కర్‌ను పదేపదే స్మరించే బదులు ఒక హిందూ దేవుడ్ని స్మరించుకుంటే మీకు ఏడు జన్మలకు స్వర్గం దక్కుతుందంటూ ఎగతాళి చేశారని అన్నారు. ఆయన వ్యాఖ్యలు ఖండిస్తున్నామని, ప్రస్తుతం స్వాతంత్య్ర స్వేచ్ఛావాయువులు పీలుస్తున్న ప్రతి భారతీయుడు ఆరాధించే వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. ఆయన పేరును ఒకటికి పదిసార్లు స్మరించుకున్నా అంబేడ్కర్ రుణం తీర్చుకోలేనిదని అన్నారు. అమిత్ షా తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీమా పరిహారం పంపిణీ



దేవరాజు సాహుకు చెక్కు అందజేస్తున్న ఏరియా మేనేజర్ మాధవ్‌సాహు

కంచిలి: తలతంపర పంచాయతీ పరిధిలోని ఏపీజీవీబీలో ఖాతాలు కలిగి స్వయంశక్తి సంఘాల్లో ఉన్న లబ్ధిదారులైన సుగుణ బిసాయి, సీతారాం రౌళో, సంగీత పండాలు ఇటీవల మృతి చెందారు. వీరు బ్యాంకులో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) లబ్ధిదారులుగా ఉన్నారు. దీంతో వారికి వచ్చిన బీమా పరిహారం చెక్కులను రూ. రెండు లక్షల చొప్పున మృతుల నామినీలకు బుధవారం తలతంపర గ్రామంలో పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ జగబంధు, టీడీపీ నేత మాదిన రామారావు, వెలుగు సీసీ బీన పాపారావు, డాక్టర్ ప్రేమ్‌కుమార్, భువన బిసాయి ఉన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. స్వేచ్ఛావతి గుడి వీధిలో ఈ నెల 19, 20 తేదీల్లో, నాయుడువీధిలో 26న, గొల్లవీధిలో 27న, పురుషోత్తపురంలో 28వ తేదీన ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక ఆధార్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్‌కార్డులో తప్పొప్పులు సవరణ చేసుకోవడానికి ఒరిజినల్ ఆధార్‌కార్డుతో పాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లను తీసుకొని రావాలని కోరారు.

ఉపాధ్యాయినికి ఎంపీపీ పరామర్శ



ఉపాధ్యాయిని భారతితో మాట్లాడుతున్న నాయకులు

కవిటి: గుర్తు తెలియని వ్యక్తి దాడిలో గాయపడిన బైరిపురం గ్రామానికి చెందిన ఉపాధ్యాయిని భారతిని ఎంపీపీ కడియాల పద్మ, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు కడియాల ప్రకాష్ బుధవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉద్దానం ప్రాంతంలో ఇటువంటి ఘటన జరగడం బాధాకరమన్నారు. పార్టీ నాయకులు యలమంచి నీలయ్య, పిరియాఆనంద్, ఎన్ని అశోక్ ఉన్నారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన

నందిగాం: విద్యార్థులు తప్పనిసరిగా వినియోగదారుల పట్టాలపై అవగాహన పెంచుకొవాలని వినియోగదారుల క్లబ్ మాస్టర్ ట్రైనర్ ఎల్‌వీ చలం అన్నారు. నందిగాం, కాపుతెంబూరు ఉన్నత పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినియోగదారుల దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. డిజిటల్ మోసాలలకు గురికాకుండా తీసుకోవలిసిన జాగ్రత్తలు, ఆహారం కల్తీ జరిగితే తీసుకోవలిసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు రామారావు, ధనలక్ష్మి, బి.మధుబాబు, అప్పలస్వామి ఉన్నారు.

సంక్షిప్తంగా...

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ



సోంపేట: దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంఘం సభ్యులు

సోంపేట: మామిడిపల్లిలోని మహాత్మా యువజన సంఘం ఆధ్వర్యంలో 50 మంది నిరుపేద కుటుంబాలకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు పాతిన శేషగిరి, పాతిన కృష్ణమూర్తి, మామిడిపల్లి విశాఖ గ్రామీణ బ్రాంచి మేనేజర్ శేషగిరి పాల్గొన్నారు.

వృద్ధులకు..

వజ్రపుకొత్తూరు రూరల్: చీపురపల్లి పంచాయతీ ఎం.గడూరు గ్రామానికి చెందిన 50 మంది వృద్ధులకు బైపల్లి, వెంకటపురం ప్రాంతానికి చెందిన అమ్మానాన్న మెమోరీయల్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ మరడ గృహలక్ష్మి, సందక్కమ్మ సేవా సంఘం అధ్యక్షుడు సాతుపల్లి శేషయ్య, సాతుపల్లి ఉపేంద్ర, సాతుపల్లి కామేశ్వరరావు ఉన్నారు.

పోలీసుల తనిఖీలు

ఇచ్ఛాపురం: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి నివారణలో భాగంగా పురుషోత్తపురం కాలనీలో ఎస్సై చిన్నంనాయుడు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. పోలీసు జాగిలంతో సిబ్బంది తనిఖీలు చేశారు.

తిలక్ పరామర్శ

టెక్కలి: టెక్కలి మండలంలో పలు కుటుంబాలను వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ బుధవారం పరామర్శించారు. పాతనౌపడ గ్రామంలో పార్టీ సీనియర్ కార్యకర్త దల్లి లోకేష్‌రెడ్డి తల్లి ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని, తిర్లంగి పంచాయతీ మాజీ సర్పంచ్ వజ్జ నరసన్న మృతి చెందడంతో అతని కుటుంబాన్ని తిలక్ పరామర్శించారు. నాయకులు టి.కిరణ్, కృష్ణారావు, రాజేష్ ఉన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేసి వారి కుటుంబాల్లో భరోసా నింపారు డిఫెన్స్ అసోసియేషన్ సభ్యులు. ఈదుపురం గ్రామానికి చెందిన శేఖర్ రౌళో, దల్లి గురుమూర్తిలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు అసోసియేషన్ సభ్యులు గుర్తించారు. బుధవారం మృతుల కుటుంబ సభ్యులకు చేరో పది వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు.

వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను జయప్రదం చేయండి

- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్

టెక్కలి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 21న నియోజకవర్గ కేంద్రమైన టెక్కలిలో నిర్వహించనున్న వేడుకలను జయప్రదం చేయాలని పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. టెక్కలి వైఎస్సార్ జంక్షన్ వద్ద జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బర్త్‌డే కేకు కటింగ్, టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి అవసరమైన రక్తదానం, ఉచిత కంటి వైద్య శిబిరం, వసతి గృహ విద్యార్థులకు రగ్గులు, అన్నదానం తదితర సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తిలక్ వివరించారు. ఆ రోజు ఉదయం ఎనిమిది గంటల నుంచి నిర్వహించే వేడుకలకు టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలంతా హాజరు కావాలని కోరారు. నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి, సంతబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, నాయకులు సత్తారు సత్యం, టి.కిరణ్, మోదుగువలస గణపతిరావు, ఎస్.సాబతో, కె.జీవన్, బి.రాజేష్, ఎన్.భీమారావు, బి.కార్తీక్, నాగిరెడ్డి, కె.నాగరాజు ఉన్నారు.

ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో జగన్ జన్మదిన వేడుకలు



దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: ఈ నెల 21న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను టెక్కలి మండలం అక్కవరం సమీపంలోని తన క్యాంపు కార్యాలయం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రారంభం కానున్న వేడుకల్లో రక్తదానం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

జగన్ జన్మదిన వేడుకలకు తరలిరావాలి

టెక్కలి: ఈ నెల 21న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా టెక్కలిలో నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేడుకలకు కోటబొమ్మాళి మండలం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పార్టీ మండల నాయకులు కోరారు. బుధవారం కోటబొమ్మాళిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నాయకులంతా ఆ రోజు ఉదయం ఎనిమిది గంటలకు కోటబొమ్మాళి చేరుకోవాలని.. ఇక్కడ నుంచి అంతా కలిసి టెక్కలిలో జరగనున్న వేడుకలు, సామాజిక కార్యక్రమాలకు హాజరవ్వాలని పేర్కొన్నారు. కోటబొమ్మాళి సర్పంచ్ కె.సంజీవరావు, మండల సీనియర్ నాయకులు రోణంకి మల్లయ్య, ఎన్.సత్యరాజ్, ఎస్.హేమసుందర్‌రాజు, ఎ.రామారావు, పి.వెంకట్రావు, బి.వెంకటరమణ, కె.చిన్నారావు, బి.చెంచులు, ఆర్.శివారెడ్డి ఉన్నారు.



కోటబొమ్మాళిలో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

వజ్రపుకొత్తూరు రూరల్: ఎయిడ్స్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎయిడ్స్ నివారణ, నియంత్రణ జిల్లా రిసోర్స్ పర్సన్ హనుమంతు నాగభూషణ్ అన్నారు. నువ్వలరేవులో సర్పంచ్ ముప్పల యజ్ఞా పర్యవేక్షణలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.జయమ్మ, జోనల్ సూపర్‌వైజర్ పి.సుధాకర్, చరణ్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

క్రీడాకారునికి సత్కారం

కాశీబుగ్గ: థాయిలాండ్‌లో జరిగిన ప్రపంచ ఎబిలిటీ స్పోర్ట్స్ యూత్ క్రీడల్లో అండర్ 20 విభాగం హైజంప్‌లో పలాస మండలం రెంటకోటకి చెందిన మంత్ర లోకేష్ చాంపియన్‌గా నిలిచారు. దీంతో అతను చదువుకున్న పాఠశాల సిబ్బంది బుధవారం సత్కరించారు. పాఠశాల డైరెక్టర్ కొర్ల మురళీకృష్ణ చౌదరి, ప్రిన్సిపాల్ కొర్ల శిరీషమ్మ ఉన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



కవిటి: వరి పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

వజ్రపుకొత్తూరు రూరల్/ఇచ్ఛాపురం రూరల్/కవిటి: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న రెండు రోజులు పాటు జోరుగా వర్షాలు కురిసే పరిస్థితి ఉందని వాతావరణ శాఖాధికారులు హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ అధికారులు, తహసీల్దార్లు రైతులకు సూచించారు. వజ్రపుకొత్తూరు వ్యవసాయ అధికారి, కిరణ్‌వాణి, ఇచ్ఛాపురం తహసీల్దార్ ఎస్.వెంకటరావు, కవిటి తహసీల్దార్ మురళీమోహన్ తదితరులు గ్రామాల్లో బుధవారం పర్యటించారు. కవిటి మండలంలో సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావుతో కలిసి తహసీల్దార్ మురళీమోహన్, వ్యవసాయాధికారి బడగల దుర్గాప్రసాద్.. పుటియాదల, చిన్నకర్రివానిపాలెం, బట్టివానిపాలెం, పెద్దకర్రివానిపాలెం, బొరివంక, జగతి గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. కొద్దిరోజులు కోతలు కోయవద్దని సూచించారు.

జగనన్న కాలనీపై ఆక్రమణదారుల కన్ను



ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలంలో మట్టి వేసి ఆక్రమణకు సిద్ధమవుతున్న దృశ్యం

టెక్కలి: గత ప్రభుత్వం జగనన్న కాలనీలు రూపకల్పన చేసి నిరుపేదలకు ఇచ్చిన విలువైన ఇంటి స్థలాలపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆక్రమణదారులు కన్నేశారు. టెక్కలిలో పాత జాతీయ రహదారికి ఆనుకుని జగతిమెట్ట వద్ద జగనన్న కాలనీలో ఆర్థిక స్తోమత లేకపోవడం, ఇతర కారణాలతో ఇళ్ల నిర్మాణాలు చేసుకోలేక ఖాళీగా వదిలేసిన ఇంటి స్థలాలను కొందరు ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో లబ్ధిదారులు నిలదీస్తే సెటిల్‌మెంట్ వ్యవహారాలకు పాల్పడుతున్నారు. ఇదే లేఅవుట్‌లో లబ్ధిదారులకు ఇవ్వగా మిగిలిన ప్రభుత్వ స్థలాలను సైతం ఆక్రమించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విషయమై ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, తహసీల్దార్ దిలీప్ చక్రవర్తికి ఎంబ్యలో ఫిర్యాదులు రావడంతో అక్రమాలను గుర్తించేందుకు ఆర్డీఓ ఆదేశాలతో తహసీల్దార్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా రెవెన్యూ సిబ్బంది పరిశీలన చేపట్టారు. ఓవైపు పరిశీలన చేస్తుండగా మరో వైపు ఆక్రమణదారులు దర్జాగా కట్టడాలు చేయడం గమనార్హం. ఇదే కాలనీలో గత ప్రభుత్వంలో అక్రిడియేషన్ జర్నలిస్టులకు కేటాయించిన స్థలాల్లో సైతం ఆక్రమణదారులు ఇళ్ల కట్టడాలకు సిద్ధమవుతుండగా అధికారులు అడ్డుకుని ఆయా స్థలాలను పరిరక్షించే చర్యలు చేపడుతున్నారు. కాలనీలో 410 ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. అధికారులు మాట్లాడుతూ.. ఆక్రమణలు సహించేది లేదని, పూర్తి నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు.

• కోతులు హల్‌చల్..



టెక్కలి మండలం గూడేం గ్రామంలో మంగళవారం కోతులు హల్ చల్ చేశాయి. పదుల సంఖ్యలో కోతులు గ్రామంలోకి రావడంతో స్థానికులు భయందోళనకు గురయ్యారు. సమీప కొండల్లోనుంచి వస్తున్న కోతులు ఎక్కడ దాడి చేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. ధాన్యం రాశులను పాడు చేసే అవకాశం ఉందరి రైతులు గుబులు చెదుతున్నారు.

–టెక్కలి రూరల్

• విద్యార్థుల ర్యాలీ..

వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా దండుగోపాలపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా వినియోగదారుల హక్కులపై ప్రజలలో అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఎం కె.చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– సంతబొమ్మాళి

